

14న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

ఈనెల 14వ తేదీ ఆదివారం శంకర్ నేత్రాలయ హాస్పిటల్ చెన్నై వారిచే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మురళి కృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలో కంటి సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైనట్లు గుర్తిస్తే వారికి శంకర్ నేత్రాలయ హాస్పిటల్ చెన్నైలో ఉచితంగా ఆపరేషన్ చేసి, వారి ఇంటి వద్దకు వచ్చేంత వరకు రవాణా ఖర్చులు కూడా అందజేస్తారని డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. వివరాల కోసం ఈ 99858 43941 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వర్షపాతం నయం..

సాగుకు లేదు భయం..

- జూన్‌లో సాధారణ వర్షపాతం 77.2 మి.మీ
- తొలి నెలలోనే 203 మి.మీ వర్షపాతం

ఖరీఫ్ సీజన్‌లో ఒక నెల ముగిసింది. జూన్‌లో సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే మెరుగైన వర్షపాతం నమోదు కావడం.. సానుకూల అంశంగా మారింది. నైరుతి రుతుపవనాల విస్తరణతో నిత్యం వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జులై మాసంలో కూడా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వేరుశనగ వ్యవసాయ సాగు విస్తీర్ణం అధికంగా పెరగడం సానుకూల అంశం. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పండుగలో మునిగి తేలుతున్నారు.


వేరుశనగ పంటలో కలుపుతీస్తున్న కూలీలు

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గంలో 2024 ఖరీఫ్‌లో అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది ఖరీఫ్‌లో అధికంగా నమోదైంది. నియోజకవర్గంలోని యాదమరి తవణంపల్లి, బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు ఐదు మండలాల్లో ఈ ఏడాది సుమారు 5,460 హెక్టార్లలో వేరుశనగ పంట సాగైనట్లు అధికారులు అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ మారు భారీ ఎత్తున వేరుశనగ పంట విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నియోజకవర్గంలో 3,160 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ పంట సాగయింది. ఈ ఏడాది మొదటి నెల ముగిసే సరికే రైతులు 5,460 హెక్టార్లలో పంట వేశారు. వీటితోపాటు వరి, కూరగాయల పంటల సాగు విస్తీర్ణం కూడా భారీగా పెరిగినట్టు వ్యవసాయ అధికారులు అంటున్నారు. పూతలపట్టు మండలంలో సాధారణ వేరుశనగ పంట విస్తీర్ణం1830 ఉండగా.. ఇప్పటికే 1190 హెక్టార్లలో వేరుశనగ పంట సాగులో ఉంది.

వేరుశనగ పంటపైనే ఆసక్తి..

వర్షాభావ పంట అయిన వేరుశనగ పంటపైనే నియోజకవర్గంలోని రైతులు అధికంగా ఆసక్తి చూపుతారు. గత ఏడాది పూతలపట్టు మండలంలో 95.6 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు కాగా.. ఈ ఏడాది ఏకంగా 1190 హెక్టార్లలో ఇప్పటికే వరి పంట సాగులో ఉంది. ముందస్తు వర్షాలతో రైతులు వేరుశనగ పంట వేయడంతో ఇప్పటికే మొలకలు వచ్చి కలుపులు తీస్తున్నారు. జూలై మాసంలో కూడా వర్షాలు విస్తారంగా పడుతుండడంతో పంట దిగుబడి పై రైతులు ఆశాజనకంగా ఎదురుచూస్తున్నారు.

బోరు బావుల్లోకి చేరుతున్న నీరు..

వర్షాలు గత ఏడాది కంటే ఈ ఏడాది విస్తారంగా కురుస్తుండడంతో ఒట్టిపోయిన బోరుబావుల్లోకి నీరు చేరుతుంది. దీంతో వేరుశనగ పంటతో పాటు వరి సాగు పై కూడా రైతులు ఆసక్తి చూపుతున్నారు. వాగులు, వంకల్లో కూడా సన్నటి నీటి దారలు ప్రవహిస్తుండడంతో రైతుల్లో వ్యవసాయంపై మరింత ఆసక్తి పెరిగింది. రైతులకు అవసరమైన కూలీలు అందుబాటులో లేకున్నా.. తమ రెక్కల కష్టాల పైనే చాలామంది రైతులు ఆధారపడుతున్నారు.

మెలకువలతో అధిక దిగుబడి

- మధురవాణి, పూతలపట్టు వ్యవసాయ అధికారిణి



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పూతలపట్టు నియోజకవర్గంలో వ్యవసాయం సాగు బాగా పెరిగింది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో రైతులు ఆనందంగా వ్యవసాయ పనులు నిమగ్నమై ఉన్నారు. వ్యవసాయ సాగులో రైతులు కొన్ని మెలకువలు తెలుసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. సొంత నిర్ణయాలతో మందులు పిచికారి చేయకుండా వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తే రైతులు లాభాల బాట పట్టవచ్చు. నిత్యం రైతులకు అందుబాటులో ఉన్న రైతు భరోసా సిబ్బంది సేవలను వినియోగించుకోవాలి.

మినీ ఎయిర్పోర్ట్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం, కిలాకి పోడు, అమ్మవారిపేట, కృష్ణరాజపురం పరిసర ప్రాంతాల్లోని మినీ ఎయిర్పోర్ట్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఇతర అధికార బృందంతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మినీ హెయిర్ స్ట్రిప్ నిర్మాణంతో రైతులకు కూరగాయలు, పారిశ్రామిక ఎగుమతులకు అనువుగా ఉంటుందని మినీ ఎయిర్పోర్టును త్వరితగతిన పనులు ప్రారంభించి నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే భూమి ఇచ్చిన రైతులకు వారి బ్యాంకు ఖాతాలకు నగదును జమ చేశామని, కోర్టు సమస్యలో ఉన్న భూములను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, పిఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, మునస్వామి, నారాయణ చారి, రామ్మూర్తి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కేంద్ర విద్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

కుప్పం టౌన్: కుప్పం మండలం నాయనూరు పంచాయతీ పెద్దవంక గ్రామసమీపంలో కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్థలపరిశీలన చేశారు. గురువారం కుప్పం నియోజకవర్గంలో పలుచోట్ల కలెక్టర్ పర్యటించారు. ఇందులో భాగంగా ఎయిర్పోర్ట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ అనంతరం నియోజకవర్గ పరిధిలో కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, డాక్టర్ వెంకటేష్ ఉన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా కూసూరు గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతూ తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కూసూరు గ్రామంలోని శ్రీ బాలసుబ్రమణ్య స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. అలాగే మండలంలోని గుడ్లనాయనపల్లి గ్రామానికి చెందిన జరుగుగ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను కలెక్టర్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ప్రారంభించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా క్రికెట్ ఆడి క్రీడాకారులలో ఉత్సాహాన్ని నింపారు. నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, మంజునాథ్, జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.


కార్గో ఎయిర్పోర్ట్ భూముల పరిశీలన

శాంతిపురం: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రామాపురం కార్గో ఏర్పోర్ట్ భూముల పరిశీలించారు. ఈసందర్భంగా రామాపురం దళిత మాదిగలను అక్కడకు చేరుకుని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ వారి సమస్యలను తెలియజేస్తూ టైటిల్ సిల్క్ ఫ్యాక్టరీ కోసం కొంతమంది దళిత మాదిగల భూములను కొంతమేరకు తీసుకున్నారని వాటికి సంబంధించిన ఒరిజినల్ పట్టా, పాస్ పుస్తకాలు తమవద్దే ఉన్నాయని చెప్పారు. అలాగే కార్గో ఎయిర్పోర్ట్‌కు సంబంధించిన కొంతమంది భూములు కూడా కోల్పోవడం జరిగిందని తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ భూమి సాగులో ఉన్నవారికి, అలాగే రికార్డులు పరిశీలించిన మీదట కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కొంతమంది మహిళలు గత 20 రోజులు నుండి తమకు నీటి సమస్య ఉందని, నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో సాయంత్రం లోపు కమిటీని పంపిం రేపటి లోగా నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కుప్పం జనసేన సమన్వయకర్త డాక్టర్ నరేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు దేవరాజు మాదిగ, బాల చంద్రబాబు పాల్గొన్నారు.

అడవి ఏనుగుల కట్టడి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- పలమనేరు

కర్ణాటకలో శిక్షణ పొందిన ఏనుగులను పలమనేరు ప్రాంతానికి తీసుకొచ్చి అడవి ఏనుగులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని ఆయన కార్యాలయంలో గురువారం ఏనుగుల దాడులను కట్టడి చేసేందుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఎలిఫెంట్ డ్రైవ్ వాహనాన్ని డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ చైతన్య కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దపంజాణి మండలం పెదకాప్పల్లి పంచాయతీ జిట్టంవారిపల్లికి చెందిన గంగయ్య ఏనుగుల దాడిలో గతంలో మృతి చెందగా ఆయన భార్య మునిలక్ష్మమ్మకు రూ. 5లక్షల నష్టపరిహారపు చెక్కును ఆయన చేతుల మీదుగా అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గంలో ఏనుగుల వల్ల తీవ్రమైన నష్టం జరుగుతూ ఉందన్నారు. గతం నుంచి ఏనుగుల దాడులను అరికట్టెందుకు ప్రభుత్వం, అధికారులు రకరకాల విధానాలను తీసుకోవడం జరిగిందని అయినా ఏనుగులను పూర్తిగా కట్టడి చేసే వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల దాడులతో గ్రామాల్లో వ్యవసాయం చేసుకొనే రైతులకు పంట, బోర్లుతో పాటు ప్రాణనష్టం అధికంగా పలమనేరు నియోజకవర్గంలోనే జరుగుతోందని అన్నారు. ఇది వరకే ట్రెంచ్‌లు కొట్టడం, సోలార్ ఫెన్సింగ్ వేశారని, ఇప్పుడు హ్యాంగింగ్ ఫెన్సింగ్ కూడా కొంత వరకు ఏర్పాటు చేయడం జరిగిందని వీటివల్ల పూర్తిగా కట్టడి అయ్యే పరిస్థితులు కనబడడం లేదని అన్నారు. అందుకు ఫారెస్ట్ అధికారులు ఒక పరిష్కారాన్ని ఆలోచించారని వివరించారు. కర్ణాటక నుంచి శిక్షణ పొందిన ఏనుగులను తీసుకొచ్చి ఇక్కడున్న అడవి ఏనుగులను వాటి ద్వారా కంట్రోల్ చేస్తే కొంతవరకు పంట నష్టం జరగకుండా కాపాడవచ్చని డిఎఫ్‌వో తెలిపారన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరి ఆ శిక్షణ పొందిన ఏనుగులను పలమనేరు నియోజకవర్గానికి తెచ్చుకోగలిగితే ఈ ప్రాంతం హైవేలో ఉండడం వల్ల ఓవైపు టూరిజం అభివృద్ధి చెందుతుందని, మరోవైపు రైతుల పంటలకు నష్టం కలగకుండా నివారించేందుకే అవకాశం ఉంటుందన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే కొరకు ఫారెస్ట్ ల్యాండ్ నుంచి సుమారు 65 హెక్టర్లు రోడ్డు ఏర్పాటుకు ఇవ్వడం మూలంగా రూ.18 కోట్ల దాకా పరిహారం సంబంధిత శాఖకు అందిందని తెలిపారు. దీన్ని పూర్తిస్థాయిలో తెచ్చేందుకు ముఖ్యమంత్రి దృష్టికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానన్నారు. వీటివల్ల ఏనుగుల దాడులతో ప్రాణ, ఆస్తి నష్టాలను జరగకుండా అరికట్టవచ్చని భావిస్తున్నానని ఆశభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శివన్న, ఎఫ్‌బిఓ, ఎస్ఎఫ్‌వో, సిబ్బంది, టిడిపి నాయకులు ఆర్‌వి.బాలాజీ, ఆర్.బి.సి కుట్టి, గిరిబాబు, నాగరాజు, సుబ్రహ్మణ్యం గౌడు పాల్గొన్నారు.


ఏనుగు దాడిలో మృతి చెందిన వారి కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పంటలపై ఏనుగుల దాడి

- మామిడి, టమాటా పంటపై దాడి - డ్రిప్ పరికరాలు ధ్వంసం

ప్రజాశక్తి- సోమల:



మండలంలోని పేటూరు పంచాయతీ ఇర్లపల్లి, ఆవులుపల్లి పంచాయతీ పత్రపల్లి పరిసర ప్రాంతాలలో జంట ఏనుగులు సంచరిస్తూ మామిడి, టమోటా పంటలపై దాడి చేసి డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసి రైతులకు తీరని నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇర్లపల్లి సమీపంలో చిట్టి అనే రైతుకు చెందిన మామిడి తోటపై దాడి చేసి మామిడి కొమ్మలు విరిచి వేసి నాలుగు రోజులుగా నానా బీభత్సం సృష్టించాయి. పత్రపల్లి గ్రామానికి చెందిన రామాంజులు, సుబ్రహ్మణ్యం, మురళి, శివకుమార్, చంద్రబాబు రైతులకు చెందిన టమోటా పంటను ధ్వంసం చేసి డ్రిప్ పైపులను పరికరాలను తొక్కి ధ్వంసం చేశాయి. కొబ్బరి చెట్లను పెకలించి వేశాయి. బుధవారం అర్ధరాత్రి ఏనుగులు దాడి చేయగా గురువారం ఉదయం తమ పంట పొలాల వద్దకు వెళ్ళగా జరిగిన నష్టం గుర్తించామని అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల భారి నుండి కాపాడాలని రైతుల కోరారు.

ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ప్రజాశక్తి- వీకోట: మండల పరిధిలో ప్రజారోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులు, పంచాయతీల సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వారు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, జిల్లా పరిషత్ నిధులతో చేపట్టే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వాతావరణం మార్పుల కారణంగా విషజ్వరాలు ప్రభలుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకుల పరిరక్షణ పరిశుభ్రత పట్ల స్థానిక నాయకుల సహకారంతో జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు. వివిధ సమస్యలతో విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి యం.శరత్ ఈ సంవత్సరం ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు కుమారి తెలిపారు. ట్రిపుల్ ఐటీకి శరత్ ఎంపిక కావడం వెనుక ఉపాధ్యాయులు కృషి చాలా ఉందని, విద్యార్థి తల్లి మొదటి నుంచి ప్రోత్సహిస్తూ అండగా ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు అభినందనలు తెలియజేశారు. తండ్రి లేకపోయినప్పటికీ కుటుంబ పరిస్థితులు అర్థం చేసుకుంటూ తల్లి కష్టాన్ని గమనించి కష్టపడి చదివిన ఈ విద్యార్థి పదవ తరగతి ఫలితాల్లో కూడా పాఠశాలలో మొదటి స్థానంలో నిలవడం గొప్ప విషయమని, ఆ విద్యార్థిని తమ పాఠశాలలోని విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.



విజయపురం: మండలంలోని జంబాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత పదవ తరగతి తెలుగు మీడియం చదివిన ద్రాక్షాయని మండలంలోనే మొదటి స్థానం సాధించింది. అలాగే ప్రస్తుతం ట్రిబుల్ ఐటీకి ఫస్ట్ లిస్టులో ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫస్ట్ అసిస్టెంట్ వెంకట కృష్ణయ్య, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



ఇది.. సిమెంట్ రోడ్డంట..!

- చెరువును తలపిస్తున్న రోడ్డు..
- చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: పై ఫొటోలో కనిపిస్తున్నది నీటి కుంట అనుకుంటే పొరబాటే.. అది సిమెంట్ రోడ్డు.. కానీ చిన్నపాటి వర్షం పడితే చాలు చెరువును తలపిస్తుంది.. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామం నుంచి విలాసవహపురం గ్రామానికి వెళ్లే దారిలో కొత్తపల్లి మిట్ట గ్రామ సరిహద్దుల వరకూ ఉంది ఈ రోడ్డు.. ఇటు వివిపురం గ్రామానికి.. అటు పక్క మండలమైన గంగాధర నెల్లూరు మండలంలోని ఎస్–ఎస్ కొండ గ్రామానికి అనుసంధానం ఉందీ రోడ్డు.. రెండు మండలాల ప్రజలు ఈ రోడ్డుగుండానే ప్రయాణించాల్సి ఉంది.. గత ప్రభుత్వ హయంలో రోడ్డు వేశారు.. అయితే ఇక్కడే అధికారులు వారి తెలితేటలకు పనిచెప్పారు.. గతంలో ఈ రోడ్డు కింద చిన్న డ్యాం ఉండేది.. వర్షపు నీరు డ్యాం ద్వారా కాలువల్లోకి వెళ్లేవి.. అయితే ఈ సారి రోడ్డు వేసిన వారు డ్యాంను వేయకుండా.. కనీసం రోడ్డు లెవల్ కూడా చూడకుండానే సిమెంట్ రోడ్డు వేశారు.. రోడ్డుకు ఇటు చివర, అటు చివర ఎత్తుగా ఉండి.. మధ్యలో పల్లంగా ఉండటంతో వర్షం పడితే చాలు నీరుమొత్తం రోడ్డుపై చేరుతున్నాయి.. నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో అక్కడే నిల్వ చేరుతున్నాయి. దీంతో ఆ మార్గం ప్రయాణించాలంటే వాహనదారులకు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.. అంతేకాకుండా చుట్టుపక్కల నివాసముంటున్న పది కుటుంబాల అవస్థలు వర్ణణాతీతం.. వర్షం పడితే వారికి అదో పెద్ద సమస్యే.. ఎటూ వెళ్లలేని పరిస్థితి.. సుమారు మోకాళి లోతు నీరు నిల్వ ఉండిపోవడంతో ఎక్కడ రోడ్డు ఉందో.. ఎక్కడ ఏ గుంత ఉందో తెలీక ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అస్తవస్తంగా ఉన్న రోడ్డును సరిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షేమ.. అభివృద్ధితో ముందుకు వెళతాం..

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, వీలైనంత ఎక్కువ సమస్యలు వచ్చే గురువారం లోపల పరిష్కరిస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. నగరపాలకతో పాటు, గుడిపాల, చిత్తూరు రూరల్ ప్రాంతాల నుంచి ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలను ఎమ్మెల్యేకు వినిపించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్వయంగా విని నమోదు చేసుకోవడంతో పాటు సావధానంగా సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సీఐ విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో 39 ఫిర్యాదులు

నగరపాలక కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో మొత్తం 39 ఫిర్యాదులు అందినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఇందులో నగరపాలక సంస్థ 20, పోలీసు 7, రెవెన్యూ 4, నేషనల్ హైవే 1, ట్రాన్స్‌కో 1, పంచాయతీరాజ్ 1, ముఖ్యమంత్రి సహాయనిధి, ఆరోగ్యశ్రీ, సాయం కోసం 5 వినతులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ మాట్లాడుతూ సమస్యలను సంబంధిత శాఖలవారీగా పంపడం జరుగుతుందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించి నివేదికలను వారంలోగా అందించాలన్నారు.



ఫోన్ ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గురజాల

వైసిపి నుంచి టిడిపిలోకి డాక్టర్ సుధీర్

- సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం
- ప్రియా నర్సింగ్ హోంపై తెలుగు తమ్ముళ్ల దాడి

ప్రజాశక్తి- కుప్పం

వైసిపి నాయకుడు, కుప్పం పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ సుధీర్ వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నట్టు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆయన, మరికొంతమంది వైసిపి నాయకులు పురపాలక సంఘం కౌన్సిలర్లతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలవడానికి విజయవాడకు బయలుదేరి వెళ్లినట్టు స్థానిక టిడిపి నాయకులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న టిడిపి యువ నాయకులు ఆవేశంతో డాక్టర్ సుధీర్‌కు సంబంధించిన ప్రియా నర్సింగ్ హోమ్ వద్దకు చేరుకున్నారు. కుప్పం పురపాలక సంఘం అధ్యక్షుడికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంతసేపటికి పురపాలక సంఘం అధ్యక్షులు వారికి తారసపడకపోవడంతో ఆవేశం కట్టలు తెంచుకున్న తెలుగు తమ్ముళ్లు ప్రియా నర్సింగ్ హోమ్ పై రాళ్లతో దాడి చేసి, ఆసుపత్రి ముఖద్వారాలను మూసివేశారు. ఈ దాడిలో ఆసుపత్రి అద్దాలు పగిలి రోడ్డుపై పడ్డాయి. అనంతరం తెలుగు తమ్ముళ్లు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైసిపి పాలనలో టిడిపి నాయకులను, ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని వైసిపి నాయకులు తమపై దాడులు చేశారని, తప్పుడు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని నేడు టిడిపిలోకి ఎలా చేర్చుకుంటారంటూ ప్రశ్నించారు. గతంలో అరాచకాలకు పాల్పడ్డ వైసిపి నాయకులు పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ టిడిపిలోకి రానివ్వమన్నారు. ఒకవేళ ఎవరైనా వైసిపి నాయకులు టిడిపిలో చేరాలనుకుంటే వారికి ఈ ఘటన గుణపాఠంగా నిలుస్తుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.


దాడిలో ధ్వంసమైన ప్రియ నర్సింగ్‌హోం

చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా డిఆర్ఓ పుల్లయ్య మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో భారత్ జనాభా ప్రథమస్థానంలో ఉందని, దేశంలో ఉన్న వనరులతో పోల్చుకుంటే అధిక జనాభా ఉండడం వలన జనాభా నియంత్రణ అత్యంత ఆవశ్యకత ఉందన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రోత్సహించిన వారికి, చేసుకున్న వారికి, చేసిన వారికి బహుమతులు ఉంటాయని తెలిపారు. మేయర్ అముద, ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ సంధ్య, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్, జిల్లా గణాంక అధికారి జార్జ్, డెమో జయరాముడు పాల్గొన్నారు.

పూతలపట్టు: నేటి సమాజంలో చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్యసిబ్బంది జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌పిహెచ్ఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సదుం : చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, జానకి, ఆరోగ్య కార్యకర్తలు రేవతి, హేమలత, సరస్వతి, సత్రాజ్, సుమలత పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి డాక్టర్ గౌరీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. 49 కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల వాణిజ్య కూడలిలో మానవహారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు రమేష్, శాంతి, ఎంపీహెచ్ఏ యమునా, ఎంఎల్‌హెచ్‌పి శోభ వరలక్ష్మి పాల్గొన్నారు.


సదుంలో..

కార్వేటినగరం : బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తు నాశనం అవుతుందని, ప్రతి బాలిక బడి బాట పట్టాలని డీఎం.పురం ఉన్నతపాఠశాల ఇన్చార్జి హెచ్‌ఎం సరస్వతి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో బాలికలు వారి తల్లిదండ్రులకు బాల్యవివాహాల వలన కలిగే కష్టనష్టాలను గురించి వివరించారు. డిఎంపురం విలేజ్ క్లీనిక్ సిబ్బంది శిరీష, అశ్వని, మోహన, లీల, ఉపాధ్యాయులు తిరుమల రాజు, హరిత పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ సర్తాజ్ ఆధ్వర్యంలో అధిక జనాభా అనర్ధకాలు, చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్న నినాదాలతో విద్యార్థులు కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

సోమల: సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది మండలంలోని పొదలకుంటపల్లె పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి, సిహెచ్ఓ అమర్నాథ్, సూపర్వైజర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్వేటినగరంలో..

చిత్తూరు డెస్క్: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జనాభా నియంత్రణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం మండల కేంద్రంలో డాక్టర్ లోహిత్ చెంగల్ రాయలు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధిక జనాభా వలన కలిగే నష్టాలను వివరించారు. డాక్టర్ రమేష్, సెల్వరాజ్, మండల సూపర్వైజర్లు ఆముదా, హరికృష్ణ, సిహెచ్ఓ దిలీప్ పాల్గొన్నారు.


గంగవరంలో..

క్రైం న్యూస్

50 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

తీగలాగితే డొంక కదిలింది


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి- పూతలపట్టు: చోరీకి గురైన 50 ద్విచక్ర వాహనాలను పూతలపట్టు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలో గత కొంతకాలంగా వరుస పెట్టి ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడంతో పూతలపట్టు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో నిందితున్ని విచారించగా తీగలాగితే డొంక కదిలినట్టు పెద్ద ఎత్తున చోరీ వివాదం వెలుగు చూసింది. వివిధ ప్రాంతాల్లో గత ఆరు మాసాల్లో చోరీ చేసిన 50 ద్విచక్ర వాహనాల గుట్టురట్టయింది. పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల వివరాలను తెలుసుకుంటూ సంబంధిత యజమానులకు వాహనాలు అందించడానికి తగిన చర్యలు చేపడుతున్నారు. త్వరలోనే నిందితున్ని అరెస్టు చూపనున్నట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- పలమనేరు: భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని టి.వడ్డూరు గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్ (22)కు ఆరు నెలల క్రితం వివాహం అయ్యింది. ఆషాఢ మాసం కావడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్ పెంగరగుంట అటవీ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటవీ ప్రాంతంలో పశువులు కాపర్లు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయచంద్ర నాయుడుకు నివాళి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పంచాయతీ పరిధిలోని టిడిపి కార్యకర్త జయచంద్ర నాయుడు బుధవారం ఎద్దు పొడవటం వలన మరణించారు. గురువారం టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ భువనచంద్ర గౌడ్, నాయకులు జయచంద్ర నాయుడు మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మృతుని భార్య సుగుణ, తండ్రి జయగోపాల్ నాయుడుకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, భువనచంద్ర, రాజేంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సిఐ



ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో ప్రయాణికులను తీసుకువెళ్లే ఆటోలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అర్బన్ సీఐ జయరామయ్య అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు గురువారం నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు మీద వాహనాలు అడ్డదిడ్డంగా ఆపి వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి అంతరాయం కలిగించకూడదని అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్లకూడదని, ట్రాఫిక్ నిబంధనలు, ప్రభుత్వం పెంచిన ట్రాఫిక్ చలానలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ట్రాఫిక్ నిబందనలు ఉల్లంగిస్తే అధిక మొత్తం జరిమానా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బీసీజీ వ్యాక్సినేషన్ తనిఖీ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోనాపల్లి, బుడితిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్టేట్ నోడల్ ఆఫీసర్ నరసింహ, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. టీబీ వ్యాధి వయస్సుమళ్లిన వారిలో రాకుండా అరికట్టేందుకు 60 సంవత్సరాలపై బడిన వారికి మొదటి విడతగా బీసీజీ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించారని తెలిపారు. ప్రతి సోమ, గురు వారాల్లో ఈ వ్యాక్సినేషన్ ఉప ఆరోగ్య కేంద్రాల్లో వేస్తున్నారని తెలిపారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ సిబ్బందితో మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సినేషన్ ఎలా జరుగుతున్నది ప్రజల నుండి ఎలాంటి స్పందన ఉందన్న విషయాన్ని అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులు విద్యాపరంగా ఎదగాలి

సయ్యద్ సుహేల్ బాష

ప్రజాశక్తి- పుంగనూరు: మైనార్టీ విద్యార్థులు విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని మైనార్టీ టిడిపి నేత సయ్యద్ సుహేల్ బాష అన్నారు. పట్టణంలోని ఉర్దూ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలు వ్యాపారపరంగానే కాకుండా విద్యాపరంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచిస్థాయికి ఎదగాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో కూడా మైనార్టీలకు విద్యాపరంగా రాజకీయపరంగా అధిక ప్రాధాన్యతనిచ్చే వారిని ఈ దపా కూడా మైనార్టీలకు అంతే ప్రాధాన్యతను ఇస్తారన్నారు. ఉర్దూ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇచ్చేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చలపతి, మైనారిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మల కత్తిరింపుతో అధిక దిగుబడి'

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మామిడికాయలు కోత దశ తర్వాత చెట్లకు పక్కనున్న రెమ్మలు కత్తిరించడం వల్ల అధిక దిగుబడి వస్తుందని హార్టికల్చర్ అధికారి వరప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని వీరప్పల్లి గ్రామంలో రైతుకు చెందిన మామిడి తోటను పరిశీలించారు. మామిడిలో కొమ్మలు కత్తిరింపుల ఆవశ్యకత గురించి వివరించారు. కాయలు కోసిన వెంటనే జూలైలో కొమ్మ కత్తిరింపుల ప్రక్రియను చేపట్టాలన్నారు. మామిడిలో పూత 4-5 నెలల కొమ్మల మీద వస్తుంది కాబట్టి పూతవచ్చే కొమ్మలను చివరి బాగంలో ఎండిన కొమ్మలను, అడ్డదుడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి వేయాలని రైతులకు సూచించారు. తద్వారా చెట్టుకు పూర్తిస్థాయిలో ఎండ, గాలి కింద కొమ్మలకు తగలడానికి వీలుగా చెట్టు కాయలు అధికంగా దిగుబడి వస్తుందని అన్నారు.

సబ్సిడీ ద్వారా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని ఆనీగనూరు రైతుసేవ కేంద్రంలో సబ్సిడీ ద్వారా రైతులకు జొన్నలు, మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. టిడిపి ప్రభుత్వంలో రైతులను సంవత్సరానికి రూ.20వేల సాయం అందించి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ సతీష్, మాజీ జెడ్పిటిసి మనస్వామి, మాజీ సర్పంచ్ రామ్మూర్తి నేతలు కృష్ణారెడ్డి, షణ్ముగం, మహేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, శంకరాచలం, సుభాష్, గోపి పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాలు పంపిణీ



ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు పశువైద్య కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా చేపట్టిన 'పశుగ్రాస వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న, పశుగ్రాస విత్తనాలను 75 శాతం సబ్సిడితో పాడి రైతులకు టిడిపి నేతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలను వినియోగించుకుని ఆర్థికంగా ముందు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రాళ్ళబూదుగూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్‌ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలకు కావలసిన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని కాబట్టి విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఆర్ఎస్ మనీ, బసవరాజు, జయరాజు, వాజిత్, రామప్ప, పూజా, గోవిందరాజులు, విజయ్, శంకరప్ప, అశోక్, ఆనంద్, శ్రీనివాసులు, ఎం ఆర్ నారాయణ, గ్రామ సర్పంచ్ లక్ష్మి మురుగేష్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ప్రతి పేదవాడు విద్యను అభ్యసించాలి వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి అన్నారు. గురువారం మండలంలోని గుంతూరు ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందించే బ్యాగులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావంతులుగా తయారు చేసేందుకు సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని అందులో పాఠ్యపుస్తకాలు బ్యాగులు, సమవస్త్రాలు అమ్మకు వందనం పథకాలను ప్రవేశపెట్టినదని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధుసూదన్, ఉపాధ్యాయులు వాసుదేవయ్య పాల్గొన్నారు.

కుప్పం టౌన్: కుప్పం మండల పరిధిలోని వానగుట్టపల్లి పంచాయతీ రాగిమానుమిట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో యూనిట్ ఇన్చార్జి శివకుమార్, కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ రాజగోపాల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కరిస్తారని విద్యార్థులకు హామీ ఇచ్చారు. యూత్ ఇన్చార్జి అజీమ్, మైనార్టీ విభాగ మండల అధ్యక్షులు బాబు, పార్టీ అధ్యక్షులు రిజ్వాన్, అజ్మల్, మహబూబ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4వేల కోట్ల నిధులు గోల్‌మాల్

మాజీ మంత్రి అంజాద్ బాషాను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- పుంగనూరు: మైనార్టీలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న వైసీపీ అదే మైనార్టీల పొట్టకొట్టి రూ.4వేల కోట్లకు పైగా నిధులు గోల్ మాల్ చేశారని రాజంపేట పార్లమెంట్ బీజేపీ ఉపాధ్యక్షులు అయూబ్ ఖాన్ ఆరోపించారు. ముస్లింల నోరుకొట్టిన మాజీ మంత్రి అంజాద్ బాషాను పోలీసులు అరెస్టు చేయాలని ఆయన గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనార్టీల సంక్షే మానికి ఐదేళ్లలో 15,931 కోట్లు మన రాష్ట్రానికి ఇస్తే.. జగన్ ప్రభుత్వం 11,324 కోట్లు ఖర్చు చేసినట్లు చూపిస్తోందన్నారు. మెడికల్ క్యాంపులు పెట్టి 100కోట్లు ఖర్చు చేశారా.. 400కోట్లతో ముస్లిం యువతకు స్కిల్ నైపుణ్య శిక్షణ ఇచ్చారా.. ఈ లెక్కలు వింటుంటేనే ఆశ్చర్యమేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి మైనార్టీల నిధులు కాజేసిన దొంగల్ని జైలుకు పంపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు.

వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- శాంతిపురం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలలో భాగంగా గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో జెసిబి సహాయంతో పూడికతీత పనులను చేపట్టారు. డయేరియా, మలేరియా కేసులు రాకుండా ముందస్తు చర్యగా పారిశుధ్య పనులను చేపట్టారు. ప్రజలు చెత్తను ఎక్కడపెడితే అక్కడ వేయకుండా ఉండాలని కోరారు. గ్రామ సర్పంచ్ లక్ష్మి మురుగేష్, వార్డు సభ్యులు పూజ హారతి, పంచాయతీ కార్యదర్శి వనిత పలువురు పాల్గొన్నారు.

పగలే వెన్నెల..!

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ, వరత్తూరు, తూగుండ్రం, చిన్న వేపంజేరి, బాలగంగానపల్లి పంచాయతీల పరిధిలో ఉన్న కొన్ని గ్రామాల పురవీధులలో విద్యుత్ స్తంభాల ఎల్ఈడి బల్బులు 24 గంటలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి.



ప్రభుత్వం విద్యుత్ ఆదా చేయాలని ఆకాంక్షిస్తున్న పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ దీపాలు రాత్రిపూట మాత్రమే వెలిగేలా చర్యలు చేపట్టి విద్యుత్ ఆదా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు జూనియర్ కాలేజీ ప్రారంభం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అనుబంధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు కావడంతో ఆ కాలేజీ ప్రారంభోత్సవానికి శుక్రవారం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి హాజరవుతున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

హోంగార్డు వేధింపులు

మీడియాను ఆశ్రయించిన బాధితుడు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: హోంగార్డు ఎంసి.రాజన్ ఇంటికి దారి ఇవ్వలేదని కక్షతో తన ఇంటి ముందు వీధిలో గుంత తవ్వాడని, గుంతను పూడ్చుకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గిరింపేజ భరత్ నగర్‌కు చెందిన నరసింహులు శెట్టి మీడియాను ఆశ్రయించాడు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో నరసింహులు శెట్టి మాట్లాడుతూ హోంగార్డు ఎంసి రాజన్‌పై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి దారి ఇవ్వలేదని పైపులైను సైతం అనధికారికంగా తీసుకున్నామని నిందలు మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జీవో 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీపీఎఫ్ నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు గోపీనాథ్, అమర్నాథ్ రెడ్డి, మధు, మునీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను చిన్నభిన్నం చేసిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల సహాయకులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు కొనసాగించాలని, యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులకు టేబుల్ కాపీ పాఠ్యపుస్తకాలు అందించాలని, అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకే వర్తింపజేయాలని కోరారు.

అమరావతి అభివృద్ధికి మహిళల సహకారం

ప్రజాశక్తి- కుప్పం: రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి మహిళా సంఘాలలోని మహిళలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించుకున్నారు. గురువారం కుప్పం పట్టణంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, ముంతాజ్ బేగంల ఆధ్వర్యంలో మహిళా సంఘాలు సమావేశమయ్యారు. గ్రామ సమాఖ్య 4లోని 50 గ్రూపులలోని 500 మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.100ల చొప్పున రూ.50వేలు రాష్ట్ర రాజధాని అభివృద్ధికి అందించాలని నిర్ణయించారు. త్వరలో ఈ విరాళం మొత్తాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతికి అందించనున్నట్టు వారు తెలిపారు. సిఓ జగదీష్, ఆర్‌పి కిరణ్ కుమార్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు.. పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి- కుప్పం: పట్టణంలోని బైపాస్ రోడ్ పై వృథాగా పోతున్న మంచి నీటిని చూసి పట్టణ ప్రజలు ఔరా అంటున్నారు. నడిరోడ్డుపై వృథాగా పోతున్న నీరు సాక్షాత్తు మండల రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిందని తెలుసుకున్న ప్రజలు విమర్శలు గుపిస్తిన్నారు. రాష్ట్ర ప్రకభుత్వం కుప్పం ప్రజల సౌకర్యార్థం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మించారు. అయితే ఈ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా వారి కార్యాలయ ఆవరణ నుంచి రోడ్డు పైకి వృథాగా పోతున్న నీటిని చూపుతున్నారు. ఇలా తరుచూ జరుగుతోందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటూ కార్యాలయ చుట్టుపక్కల ప్రజలు తెలియజేశారు.

మాతృభాషలో విద్యాబోధనకు కృషి చేయాలి

ఎంపికి తులసీనాథం నాయుడు వినతి



ప్రజాశక్తి- గంగవరం : నూతన జాతీయ విధానం 20-20 ప్రకారం పాఠశాలలో విద్యాబోధన మాతృభాషలో ఉండే విధంగా కృషి చేయాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావుకు తెలుగు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు, కార్యదర్శి పుష్ప గురువారం వినతిపత్రం అందించారు. తులసీనాథం నాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యాజమాన్య పాఠశాలల్లో వారివారి మాతృభాషలో విద్యాబోధన ఉండేలాగా పార్లమెంటు సమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, రవి మురళి, వినోద్, చాణుక్య పాల్గొన్నారు.

ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ 73వ వార్షికోత్సవం

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ 73వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిపో ఎదుట గురువారం ఎంప్లాయిస్ యూనియన్ జెండాను రీజనల్ సంయుక్త కార్యదర్శి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రముఖ న్యాయవాది వెంకట ముని, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు, రూరల్ అధ్యక్షులు మాధవరెడ్డి, సివి రెడ్డి,పోలీస్ గిరి, నాగరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పుంగనూరు డిపో పరిధిలో ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. యూనియన్ కార్మిక సమస్యలపైన, ఆర్టీసీ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఒప్పంద కార్మికుల సమస్యలపై కూడా ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమాలు చేస్తామన్నారు. యూనియన్ నాయకులు అన్వర్, పుంగనూరు డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జెఆర్ రెడ్డి, కార్యదర్శి జీవీ రమణ, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళి మోహన్ అన్నారు. గురువారం బంగారుపాళ్యం మండలం మొగిలి దేవరకొండ శివపార్వతుల గోశాలలో చాతుర్మాస మహ యాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి వైభవంగా ప్రారంభమైన ఈయాగంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, దేవరగొండ శివపార్వతుల గోశాలలో నిర్వహించిన గోపూజ, చాతుర్మస మహాయాగం చాలా గొప్పదని అన్నారు. ప్రజలు సుఖః సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ యాగాన్ని నిర్వాహకులు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, సరైన సమయంలో వర్షాలు కురిసి అన్నదాత సుభిక్షంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీపీ సుచిత్ర, మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, తెలుగు యూత్ అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లను జేఏలుగా నియమించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - కార్వేటినగరం: సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వారి విద్యార్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని గురువారం నియోజకవర్గంలోని డిజిటల్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను వారి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయంలో రిక్రూట్మెంట్ 2019లో పంచాయతీ సెక్రెటరీ (గ్రేడ్-6) డిజిటల్ అసిస్టెంట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గ్యాడువేషన్, కంప్యూటర్ సైన్స్ సబ్జీ ఉండాలని ఆంక్షతో దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో బీటెక్, ఎం.టెక్, ఎంసిఏ అలాగే 20శాతం మంది పిహెచ్‌డి చేసిన వారు ఉన్నారని, తమలో అత్యధికంగా సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, అదేవిధంగా ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసిన వారు ఉన్నారని పేర్కొన్నారు. ఇంతటి ఉన్నత విద్య అనుభవం ఉన్న వారిని డిజిటల్ అసిస్టెంట్ గత ప్రభుత్వం నియమించి అపెండర్ పే స్కేల్ ఇచ్చి అన్యాయం చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం డిజిటల్ అసిస్టెంట్ టైటిల్ ఇచ్చి తమ పోస్టులకు సర్టిఫికెట్ జాబ్ ఇచ్చినప్పటికీ మమ్మల్ని అన్ని డిపార్ట్మెంట్ అధికారుల నుంచి కిందస్థాయి సిబ్బంది వరకు కార్యాలయాల్లో జిరాక్స్ ఆపరేటర్లుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాలలో వీఆర్వో లాగిన్‌లో డిజిటల్ అసిస్టెంట్లు పని చేయలేదని షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారని తెలియజేశారు. కనుక పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నుంచి డిజిటల్ అసిస్టెంట్‌ను తప్పించి వారివారి విద్యార్హతను బట్టి ఉద్యోగం జీతాలు అమలు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.



దోమ లార్వాల నియంత్రణకు గంబూసియా చేప పిల్లలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్టాఫ్ డయేరియా కాంపెయిన్ -2024, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలో భాగంగా నిల్వ నీటిలో దోమల లార్వాల నియంత్రణకు గంబూసియా చేపల పిల్లలను వదిలారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు.. నగరపాలక పరిధిలోని చెరువులు, లోతట్టు ప్రాంతాల్లోని నిల్వనీటిలో గురువారం లక్షకు పైగా గంబూసియా చేప పిల్లలను వదిలారు. ఈ చేపలు నీటిలోని దోమ లార్వాలను మాత్రమే తిని జీవిస్తాయి. దోమ లార్వాలను గణనీయంగా నాశనం చేయడం ద్వారా దోమల జనాభాను నియంత్రించడంలో భాగంగా నిల్వ నీటిలో గంబూసియా చేప పిల్లలను వదులుతున్నారు. శుక్రవారం నగరపాలక పరిధిలోని కట్టమంచి చెరువు, గంగినేని చెరువు, దుర్గానగర్ కాలనీ చెరువు, ప్రశాంత్ నగర్, వైయస్సార్ నగర్, రోసీ నగర్, కొండారెడ్డిపల్లి ప్రాంతాల్లోని నిల్వ నీటి ప్రాంతాల్లో చేప పిల్లలను వదిలారు. ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రారెడ్డి, అర్బన్ సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, సానిటరీ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ రెడ్డి, మలేరియా అసిస్టెంట్ మురళి, వార్డు కార్యదర్శులు, ఏఎన్ఎం పాల్గొన్నారు.